


ఇద్దరు టీచర్లకు విద్యారత్న అవార్డు

వికారాబాద్, ఫిబ్రవరి 5:జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు స్వరూప, గోపాల్ విద్యారత్న అవార్డును అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాభివృద్ధికి బహుజన సాహిత్య అకాడమీ ఏటా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు పలు అవార్డులను అందజేస్తోందని వివరించారు.



ఐదేళ్లకోసారి ఎన్నికలొచ్చి ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా నిరుద్యోగుల తలరాతలు మాత్రం మారడం లేదు. ఏ పార్టీ అధికారంలోకొచ్చినా ఉద్యోగార్థుల ఆశలను నెరవేర్చడం లేదు. మెగా డీఎస్సీ నిర్వహించి జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీచేయాలని ఏడేళ్లుగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం నామమాత్రంగా జిల్లాలో 191 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినా ఆ పోస్టులు ఏ మూలకూ సరిపోవని బీఎడ్/డీఎడ్ అభ్యర్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో వందల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు భర్తీ చేయాలని.. రాష్ట్రంలో 20వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్‌తో రేపు హైదరాబాద్‌లోని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు.

మెగా డీఎస్సీ ఎప్పుడు?

- ఏడేళ్లుగా పూర్తిస్థాయి ఖాళీలను భర్తీ చేయని ప్రభుత్వం
- నామమాత్ర పోస్టులతో 2023లో డీఎస్సీ
- పోస్టులన్నింటికీ నోటిఫికేషన్ ఇవ్వాలంటున్న నిరుద్యోగులు
- కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన
- రేపు హైదరాబాద్‌లోని పాఠశాల విద్యా కమిషనరేట్ ముట్టడి


వికారాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మెగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న డీఎడ్, బీఎడ్ నిరుద్యోగులకు నిరాశే ఎదురవుతోంది. ఎక్కువ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వీలుగా డీఎస్సీ ప్రకటనకు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీచేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నా.. ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చేందుకు సమయం పట్టే అవకాశం ఉందని జరుగుతున్న ప్రచారంతో నిరుద్యోగులను ఆందోళన చెందుతున్నారు. మెగా డీఎస్సీకి డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు ఏడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న వారు మెగా డీఎస్సీపై రోజుకో విధంగా వైరలవుతున్న ప్రకటనలతో అయోమయానికి గురవుతున్నారు. తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించిన కాంగ్రెస్‌పై నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో త్వరలోనే మెగా డీఎస్సీ నిర్వహిస్తారని ఆశించారు. కొత్త ప్రభుత్వం వొచ్చి రెండు నెలలు కావస్తున్నా మెగా డీఎస్సీపై స్పష్టత లేక నిరుద్యోగులను నిరాశానిస్పృహలకు గురిచేస్తోంది. ఫిబ్రవరి మొదటి వారంలో డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్ జారీ చేస్తామన్న ప్రభుత్వం.. ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు, జీవో-317 దిద్దుబాటు, టెట్ పేరిట కాలయాపన చేస్తోందని డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ఉద్యోగార్థులు ఆరోపిస్తున్నారు. త్వరలోనే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రాకముందే డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్ జారీచేయాలని నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మెగా డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్‌కు, పరీక్షకు మధ్య ఉండే సమయంలో ఉపాధ్యాయ పదోన్నతులు, టెట్ నిర్వహణ పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు అంటున్నారు.

నిరుద్యోగులకు దన్నుగా నిలిచి.. అధికారంలోకొచ్చి!

మెగా డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) కోసం టెట్ క్వాలిఫైడ్ డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 సెప్టెంబర్ 20న డీఎస్సీ కోటిఫికేషన్ జారీ అయింది. జిల్లాలో అన్ని కేటగిరీల్లో 700కు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే, గత ప్రభుత్వం కేవలం 191 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడంతో జిల్లా నిరుద్యోగ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హేతుబద్ధీకరణ లేకుండా, ప్రతీ పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులుండేలా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేలా పోస్టులు పెంచాలని అప్పటి ప్రభుత్వంపై నిరుద్యోగులు ఒత్తిడి తెచ్చినా స్పందన కొరవడింది. మెగా డీఎస్సీ ప్రకటించాలని ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేసిన డీఎడ్, బీఎడ్ అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇచ్చింది. తాము అధికారంలోకొస్తే మెగా డీఎస్సీ వేస్తామంటూ ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలోనూ పెట్టారు. కాంగ్రెస్ పాలనలో డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్ జారీ అవుతుందని బలంగా విశ్వసించిన నిరుద్యోగులకు ఇప్పటి వరకూ నిరాశే ఎదురవుతోంది. కొత్త ప్రభుత్వం రెండు నెలలు అవుతున్న మెగా డీఎస్సీపై ఏ ప్రకటనా చేయకపోవడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ డీఎస్సీపై చర్చించకపోవడంపై మండిపడుతున్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, టెట్‌తో ముడి పెట్టకుండా 2024 డిసెంబరు వరకు ఉద్యోగ విరమణలతో ఖాళీ అయ్యే పోస్టులన్నీ పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం 20వేల పోస్టులకు తగ్గకుండా డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసి వెంటనే షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రేపు(బుధవారం) హైదరాబాద్‌లోని పాఠశాల విద్యా శాఖ కమిషనరేట్‌ను ముట్టడించాలని డీఎడ్, బీఎడ్ నిరుద్యోగుల సంఘం పిలుపునిచ్చింది. దీనికి రాష్ట్రంలోని నిరుద్యోగ బీఎడ్/డీఎడ్ అభ్యర్థులంతా తరలి రావాలని వారు కోరారు.

బీఎడ్/డీఎడ్ అభ్యర్థుల ఎదురుచూపులు

జిల్లాలో 743 ప్రాథమిక, 114 ప్రాథమికోన్నత, 182 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో విద్యా బోధనకు ప్రభుత్వం 4,612 ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసింది. ప్రస్తుతం 3,950 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు లేని పాఠశాలలు 14, విద్యార్థులు లేని పాఠశాలలు 34 చొప్పున ఉన్నాయి. 198 పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడే పనిచేస్తున్నారు. విద్యార్థుల్లేని పాఠశాలల్లో పోస్టింగ్ ఉన్న వారిని కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. కాగా హైస్కూల్ విద్యార్థులకు అవసరమైనంత మంది టీచర్లు లేక విద్యార్థుల చదువులు అగమ్యగోచరంగా మారాయి. 662 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, గత సెప్టెంబరులో జారీ చేసిన



317 జీవోతో తగ్గిన ఉపాధ్యాయ ఖాళీలు

డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాలో 191 పోస్టులు భర్తీకి ప్రభుత్వం అనుమతించింది. 102 స్కూల్ అసిస్టెంట్, 77 ఎస్‌జీటీ, 12 ఎల్‌పీటీ పోస్టుల భర్తీకి మాత్రమే ఆ నోటిఫికేషన్‌లో చూపారు. మెగా డీఎస్సీ ప్రకటన వస్తుందని ధీమాగా ఉన్న నిరుద్యోగులు అరకొర పోస్టులతో వచ్చిన నోటిఫికేషన్‌తో డీలా పడ్డారు. పోస్టులు పెంచాలని అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిరసన ప్రదర్శనలు సైతం నిర్వహించారు. జీవో 317లో భాగంగా జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయుల కంటే ఇతర జిల్లాల నుంచి వికారాబాద్ జిల్లాకు వచ్చిన వారి సంఖ్యే ఎక్కువగా ఉండడంతో జిల్లాలో 320 ఉపాధ్యాయ ఖాళీలు తగ్గాయి. ప్రస్తుతం జిల్లాలో ఖాళీగా ఉన్న 662 పోస్టుల్లో 361 ఖాళీలను ప్రమోషన్లతో, 301 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయనున్నారు.


నోటిఫికేషన్ జారీ చేయాలని అమరుల స్మారక స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు

అమరవీరుల స్థూపం వద్ద డీఎస్సీ అభ్యర్థుల నిరసన

మెగా డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్ జారీచేయాలని డిమాండ్ చేస్తూ డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు సోమవారం వికారాబాద్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం నుంచి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలోని అమర వీరుల స్మారక స్థూపం వద్దకు ర్యాలీగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. 20వేల పోస్టులకు తగ్గకుండా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారు ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రాకముందే వెంటనే అనుబంధ నోటిఫికేషన్ జారీచేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి


మేడ్చల్ కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ...

వికారాబాద్, ఫిబ్రవరి 5: ప్రజావాణిలో భాగంగా వచ్చిన దరఖాస్తులను, ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. మొత్తం 125 ఫిర్యాదు వచ్చాయని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రజావాణికి 150 ఫిర్యాదులు

కీసర: మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 150 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల వారి నుంచి వచ్చిన వారు దరఖాస్తులు అందజేశారు. కాగా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ


కలెక్టరేట్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఈవీఎంల పరిశీలన పారదర్శకంగా జరగాలి

- ఈ నెల 14 వరకు రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో పరిశీలన : మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

కీసర, ఫిబ్రవరి 5 : రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎలక్ట్రానిక్ వోటింగ్ మిషన్(ఈవీఎం)ల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈవీఎంల పరిశీలనలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో భద్రపర్చిన ఈవీఎంలను కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 14వ తేదీ వరకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ఈవీఎంల పరిశీలన చేస్తామన్నారు. నాయకులకు ఈవీఎంలపై కలిగే అనుమానాలను నివృత్తి చేస్తామన్నారు. నియమ, నిబంధనలకు లోబడి ఈవీఎంల పరిశీలన జరుగుతుందన్నారు. మిషన్ల పరిశీలన సమయంలో ఈసీఐఎల్‌కు చెందిన 26 మంది సాంకేతిక నిపుణులు పాల్గొంటారని.. ఈవీఎంలు, బ్యాలెట్ పత్రాల పరిశీలనలో ఎలాంటి అనుమానాలున్నా వాటిని నివృత్తి చేసేందుకు అధికారులు, సాంకేతిక సిబ్బంది సిద్ధంగా ఉంటారని కలెక్టర్ వివరించారు. పరిశీలనకు ముందు ఉప్పల్, కుత్బుల్లాపూర్, మాల్కాజ్‌గిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల గోదాములను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్వో హరిప్రియ, కార్యాలయాల సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

మునిసిపాలిటీ అభివృద్ధికి... రూ.300కోట్లకు పైగా ప్రణాళికలు

కొడంగల్, ఫిబ్రవరి 5: కొడంగల్ మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.300కోట్లకుపైగా ప్రణాళికలు సిద్ధం చేశామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి సహకరించాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కొడంగల్ అభివృద్ధికి వచ్చే ఐదేళ్లను దృష్టిలో పెట్టుకొని పనులపై ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.300కోట్ల నిధులతో ప్రణాళికలను సీఎం కార్యాలయానికి పంపించామని తెలిపారు. మునిసిపాలిటీ సుందరీకరణలో భాగంగా హైవే రోడ్డు పనుల కోసం అంబేడ్కర్ చౌరస్తాలో వ్యాపార డబ్బాలను తొలగించాలని ఇదివరకే ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అయితే పేదల ఉపాధి, ఇతర కారణాలతో వాటిని తొలగించలేకపోయామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కావడంతో ఎన్ని అవాంతరాలు ఎదురైనా వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ దుకాణాలు పెట్టుకున్న చిరు వ్యాపారులకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మడిగెలు కేటాయిస్తామని తెలిపారు. అలాగే వినాయక చౌరస్తా నుంచి శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు రోడ్డు వెడల్పు పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో డ్రైనేజీ నిర్మిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మునిసిపాలిటీలో తక్కువ ఆదాయం ఉందన్నారు. కొత్త పురపాలిక సొంతంగా ఆదాయాన్ని సమకూర్చేందుకు సమయం పడుతుందన్నారు. మున్సిపల్ కార్మికులకు వేతనాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా రూ.50లక్షల నిధులు మంజూరు చేయిస్తే తాత్కాలికంగా ఆర్థిక సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ వైస్ ఛైర్‌పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా గొప్పతనాన్ని ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలి

వికారాబాద్, ఫిబ్రవరి 5 : వికారాబాద్ జిల్లాలో భాషా సాహిత్య రంగాలను ప్రోత్సహించేందుకు కృషిచేస్తామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవల ప్రచురించిన వికారాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథాన్ని పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం కలెక్టర్‌కు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు క్రియాశీలంగా సాగుతున్నామని, ఇకపై భాషా సాహిత్యాలకూ తగిన ప్రోత్సాహం ఇస్తామని తెలిపారు. మొన్నటి వరకు పూర్వ రంగారెడ్డి జిల్లాలో ఉన్న వికారాబాద్ జిల్లా నేడు అన్ని రంగాల్లో తన ప్రతిభను చాటుకుంటోందన్నారు. ఈ అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రచురించిన పుస్తకాన్ని అందరికీ అందించే ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రతీొక్కరూ తమ జిల్లా గొప్పదనాన్ని తెలుసుకోవాలన్నారు. చెన్నయ్య మాట్లాడుతూ.. నిజాం కాలంలో 80ఏళ్ల కిందట వెలసిన తెలంగాణ సారస్వత పరిషత్తు తెలుగు భాషా పరిరక్షణకు అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాషా-సాహిత్యాలు, కళలు మొదలైన అంశాలపై సమగ్ర గ్రంథాలను వెలువరిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే 16 జిల్లాలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ గ్రంథాన్ని రూపొందించడంలో పరిషత్తుకు తోడ్పడిన అవధాని అంజయ్య ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డిపై పద్యాన్ని ఆలపించారు.


వికారాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథాన్ని కలెక్టర్‌కు అందజేస్తున్న డాక్టర్ చెన్నయ్య

బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బు మాయం!

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రిటైర్డ్ ఉద్యోగి
- బ్యాంక్ ఖాతా నుంచి రూ.1,49,997 ఖాళీ!

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5: సైబర్ నేరగాళ్లు ఓ రిటైర్డ్ ఉద్యోగి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు తస్కరించిన సంఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోచారం సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మునిసిపల్ ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఉండే ఓ రిటైర్డ్ ఉద్యోగి(71)కి నగరంలోని తార్నాకలో గల ఓ బ్యాంక్‌లో సేవింగ్ అకౌంట్ ఉంది. జనవరి 26న గుర్తుతెలియని వ్యక్తి మాజీ ఉద్యోగికి ఫోన్‌చేసి మీ బ్యాంక్ ఖాతాను అప్‌డేట్ చేయాలి, ఓటీపీ వస్తుంది అది చెప్పాలన్నాడు. దీంతో నిజమని నమ్మిన వృద్ధుడు.. సదరు వ్యక్తి అడిగిన ఓటీపీలను మూడుసార్లు చెప్పాడు. దీంతో అతడి బ్యాక్ ఖాతా నుంచి రూ.49,999 చొప్పున మూడుసార్లు మొత్తం రూ.149,997 ఖాళీ అయ్యాయి. తన బ్యాంక్ నుంచి నగదు తస్కరించిన విషయం గుర్తించి బాధితుడు వెంటనే సదరు నెంబర్‌కు కాల్‌చేస్తే స్విచాఫ్ వచ్చింది. దీంతో రిటైర్డ్ ఉద్యోగి చివరికి సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

సదుపాయాల కల్పనే లక్ష్యం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5: గ్రామాల్లో మౌలికసదుపాయాల కల్పనే తమ లక్ష్యం అని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. మర్రిపల్లిగూడ, ఎదులాబాద్, మాదారం గ్రామాల్లో సోమవారం రూ.45లక్షల జడ్పీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, యూజీడీ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ఇప్పటి వరకు జిల్లా పరిషత్ నుంచి 18కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. బీఆర్ఎస్ హయాంలో పంచాయతీలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కానీ తాను జెడ్పీ నుంచి నిధులు ఇచ్చి అభివృద్ధికి పాటుపడ్డానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో అరుణారెడ్డి, ఎంపీటీసీలు సరళ, రవి, శోభారాణి, మాజీ సర్పంచ్‌లు మంగమ్మ, సాయిలు, యాదగిరి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కుమార్, నరేష్, రవిగౌడ్, శ్రీకాంత్, ప్రవీణ్, సురేష్, అశోక్, బాబూగౌడ్, శ్రీశైలం, అమర్, బస్వయ్య, అధికారి బలరాం, కార్యదర్శులు శ్రీనివాస్, రామ్మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గౌడవెల్లి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులకు శ్రీకారం

- ఇకపై రాకపోకలు బంద్
- పనులను త్వరగా పూర్తి చేయాలంటున్న గ్రామస్తులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5: మేడ్చల్ మండలం గౌడవెల్లిలోని రైల్వే గేటు వద్ద అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి పనులకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. ఎన్నో రోజుల కింద రైల్వే అధికారులు అండర్‌పాస్ రైల్వే బ్రిడ్జి కోసం సర్వేలు నిర్వహించి చివరికి పనుల కోసం జిల్లా కలెక్టర్ అనుమతి పొందారు. ఈ పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయని, గౌడవెల్లి రైల్వే గేటును శాశ్వతంగా మూసివేసి రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే గేటు వద్ద పనులకు సంబంధించి నోటీసును ఏర్పాటు చేశారు. దీంతో గౌడవెల్లి వాసులు రైల్వే గేటు దాటి గుండ్లపోచంపల్లి-నూతన్కల్, ఆర్‌అండ్‌బీ రోడ్డుకు, ఇందిరాగాంధీ విగ్రహ కూడలికి పోవాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. బ్రిడ్జి పనులు పూర్తయ్యే వరకు గ్రామస్తులకు దూరాభారం తప్పదు!



రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన నోటీసు

చుట్టూ తిరగక తప్పని తిప్పలు

మేడ్చల్, గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీల్లో నాలుగేళ్ల కిత్రం రైల్వే అధికారులు ప్రారంభించిన అండర్‌పాస్ బ్రిడ్జి పనులు నేటికీ పూర్తికాలేదు. దీంతో పట్టణ వాసులు, మండలంలోని ఏడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మేడ్చల్ నుంచి రాయిలాపూర్, గిర్మాపూర్, నూతన్కల్, శ్రీరంగవరం, బండమాదారం, లింగాపూర్ గ్రామాలకు పోయే వారు గౌడవెల్లి గ్రామ రైల్వే గేటు మీదుగానే వెళ్తున్నారు. ఇప్పుడు ఆ గేటు కూడా మూసివేయడంతో ప్రజల కష్టాలు రెట్టింపయ్యాయని స్థానికులంటున్నారు. అయితే పనులు త్వరగా పూర్తి చేస్తే తమకు ఇబ్బందులు తీరుతాయని, ఆ మేరకు రైల్వే అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5: విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని శ్రీనిధి సెంటర్ ఆఫ్ ఎంట్రెన్యూర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ ప్రతినిధి డాక్టర్ శృతి భార్గవ్ చోబే అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇండియా డిజైన్ థింకింగ్ ఫర్ అమృత్ భారత్ అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డాక్టర్ శృతి మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ఫలాలను అందరికీ అందించడమే వికసిత్ భారత్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. డిజైన్ థింక్‌తో కొత్త అవిష్కరణలు చేయవచ్చన్నారు. నేడు ప్రపంచ దేశాలు తమకు తోచిన కొత్త ఆలోచనలతో తమ ప్రోడక్ట్‌లను ప్రజలకు ఆకట్టుకునే విధంగా ప్రపంచానికి అందిస్తున్నారన్నారు. డైజన్ థింక్‌లో పోటీతత్వం పెరిగి పలు రకాల వస్తువులను కొత్త ఆకర్షణలతో ప్రజల ముందుకు వస్తున్నాయని తెలిపారు. డిజైన్ థింక్ ద్వారా నేడు పేరుగాంచిన అనేక పరిశ్రమలు మంచి ఫలితాలను సాధిస్తున్నాయన్నారు. కొత్త ఆవిష్కరణలకు రూపకల్పన చేసే డిజైన్ థింక్స్‌పై ఆసక్తి కనపరిచాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. రానున్న తరాలకు ఉపయోగ పడే పరికరాలు, వస్తువులు, నిత్యం వినియోగించుకునే సామగ్రి ఏవిధంగా ఉండాలన్న విషయాన్ని డిజైన్ థింక్ ద్వారా రూపకల్పన చేసుకోవచ్చన్నారు. ఇంజినీరింగ్ అభ్యసించే విద్యార్థులకు ఇది ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సరిత, హెచ్‌ఎండీ డాక్టర్ షణ్ముఖ ప్రియ, పీఆర్‌ఓ సుధాకర్ పాల్గొన్నారు.


డాక్టర్ శృతి భార్గవ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

నెహ్రూ యువక కేంద్ర జిల్లా కమిటీ సభ్యుడిగా నరేష్‌యాదవ్


ఉత్తర్వుకాపీని అందజేస్తున్న విక్రమ్‌రెడ్డి, తిరుమలరెడ్డి

శామీర్‌పేట, ఫిబ్రవరి 5: నెహ్రూ యువక కేంద్ర అడ్వైజరీ బోర్డు మేడ్చల్ జిల్లా కమిటీ నూతన సభ్యుడిగా శామీర్‌పేట మండలం తూంకుంటకు చెందిన తోకల నరేష్‌యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు కేంద్ర నెహ్రూ యువక కేంద్ర డైరెక్టర్ జనరల్ నితీష్‌కుమార్ మిశ్ర ఉత్తర్వులను జారీచేశారు. ఈ ఉత్తర్వుల కాపీని సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి, కార్యదర్శి అమర మోహన్‌రెడ్డిలు నరేష్‌యాదవ్‌కు అందజేశారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 5: బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశంలో తనను వేదికపై నుంచి దిగిపో అంటూ సామాజిక వర్గం పేరుతో దూషించి దారుణంగా అవమానించిన వ్యక్తులపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లేదంటే అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి నాలుగు రోజులవుతున్నా ఇంత వరకు కేసు నమోదు చేయలేదని మండిపడ్డారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం ఏర్పాటు చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 5: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం ఏర్పాటు చేయాలని ఏబీవీపీ జిల్లా హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఏబీవీపీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30సంవత్సరాల తరువాత ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారని ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిగ్రీ కళాశాల సౌకర్యాలు లేకుండా నడుస్తుందన్నారు. విద్యార్థినులకు కనీసం మూత్రశాలలూ లేవన్నారు. పోస్టులు వెంటనే భర్తీ చేయడంతో పాటు ఐదెకరాల భూమిని కేటాయించి పక్కా భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ జగదీశ్ చారి, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ మంజునాథ్‌రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రావు













గ్రామాభివృద్ధిలో కార్మికుల సేవలు వెలకట్టలేనివి

కీసర, ఫిబ్రవరి5: గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్మికుల సేవలు వెలకట్ట లేనివని డీఎల్పీవో స్మిత అన్నారు. మండల పరిధిలోని రాంపల్లి దాయర గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్మికులను మాజీ ఉపసర్పంచ్ రాము, కో-ఆప్షన్ సభ్యుడు హనుమంత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అధికారులను సత్కరించి, జ్ఞాపికలను, కార్మికులకు చీరలు, దుస్తులు అందజేశారు. ఎంపీడీవో గ్యామా, మండల విద్యాధికారి శశిధర్, ఎంపీవో వినూత్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకే 'వేతనం' కరువు

- 14 నెలలుగా పెండింగ్
- ఒక్కొక్కరికి రావల్సింది రూ.63,700

వికారాబాద్, ఫిబ్రవరి 5 : ప్రజలచే ఎన్నికై సేవలందిస్తున్న కౌన్సిలర్లకు గౌరవ వేతనం సమయానికి అందడం లేదు. ఏకంగా 14 నెలలుగా వీరికి 'వేతనం' పెండింగ్‌లో ఉంది. వికారాబాద్ మునిసిపాలిటీలో 34 వార్డులు ఉన్నాయి. ఆ వార్డుల కౌన్సిలర్‌లలో ప్రస్తుతం ఒకరు చైర్మన్, మరొకరు వైస్‌చైర్మన్, 31 మంది కౌన్సిలర్లు, ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. మునిసిపాలిటీకి వచ్చే ఆదాయంలో జనరల్ ఫండ్ నుంచి సభ్యులకు గౌరవ వేతనం అందించాలి. కానీ వికారాబాద్ మునిసిపాలిటీలో సమయానికి రాకపోవడంతో పలువురు సభ్యులు వేతనం కోసం ఎదురు చూస్తున్నారు. మూడు సంవత్సరాలుగా పాలన అస్తవ్యస్తంగా మారడం కుర్చీల కొట్లాటలు తప్ప మునిసిపల్ అభివృద్ధి కోసం ఆదాయ వనరుల కోసం ఆలోచించే వారే కరువయ్యారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్‌ల మధ్య వైరం పాలనా వ్యవస్థను కుంటు పడేలా చేసిందని పట్టణ ప్రజలు, కౌన్సిల్ సభ్యులు మండిపడ్డ పరిస్థితులు గతంలో ఉండేవి.

పేరుకుపోయిన బకాయిలు

మునిసిపాలిటీలోని 34 వార్డులకు గాను 34 మంది సభ్యులకు ప్రతి నెల రూ. 4550, చైర్‌పర్సన్‌కు రూ.19500లు, వైస్ చైర్మన్ కు రూ. 9750 చొప్పున గౌరవ వేతనంఅందించాల్సి ఉంది. కానీ వీరికి 14 నెలలుగా గౌరవ వేతనం అందడం లేదు. డిసెంబర్‌లో ఒక నెల వేతనం మాత్రమే వేసినట్లుగా తెలుస్తోంది. ప్రతి సభ్యుడికి రూ. 63,700 ల వరకు రావాల్సి ఉంది. సభ్యులందరికి కలిసి 14 నెలల కాలానికి గాను రూ. 25,75,330 డబ్బులు అందించాల్సి ఉంది.

గతంలో 3250 .. వచ్చిన వారికే డబ్బులు

సభ్యులకు గతంలో ప్రతి నెల రూ. 3250 చెల్లించేవారు. అది కూడా సమావేశానికి హాజరైన సభ్యులకు మాత్రమే ఇచ్చే వారని పలువురు సభ్యులు చెప్పారు. గత ప్రభుత్వం 2022 జనవరి 12న గౌరవ వేతనాన్ని పెంచి ఇవ్వాలని నిర్ణయించింది. కొత్తగా వచ్చిన జీవోతో ప్రతి సభ్యుడికి రూ. 4,550 చెల్లించాలని ఆదేశాలు రావడంతో పెరిగిన వేతనాన్ని అధికారులు వారి ఖాతాల్లో వేస్తున్నారు. వికారాబాద్ మునిసిపల్ లో మాత్రం సభ్యులకు ఇంకా రావడం లేదని, సభ్యులలో ఆర్థిక స్తోమత తక్కువ ఉన్నవారు పలువురు ఉన్నారని, ఈ డబ్బులు వారికిఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పలువురు సభ్యులు పేర్కొన్నారు.



వికారాబాద్ మునిసిపల్ కార్యాలయం

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 5 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవాలని ఆ పార్టీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామ ఎల్లమ్మదేవాలయ కమిటీ చైర్మన్ మర్యాద మురళీధర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యకర్తకు ఎలాంటి అవసరం ఉన్నా అండగా ఉంటానని చెప్పారు. త్వరలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మకమిటీలు వేసి ప్రభుత్వపథకాలను అర్హులైన వారికి చేరవేయడానికి కృ కృషి చేస్తామని చెప్పారు. కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్ ఎప్పుడు అన్యాయం చేయదని చెప్పారు. ఏనుగు జంగారెడ్డి, మాజీ ఎంపీపీ కె. రఘుమారెడ్డి, మురళీధర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బాల్‌రాజ్, రమేష్, రాజు, కృష్ణానాయక్, లాజర్, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకోవాలి

- జస్టిస్ చంద్రకుమార్

పరిగి, ఫిబ్రవరి 5 : ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మండలంలోని నజీరాబాద్‌తండాకు చెందిన ఎం.హరిశ్చందర్ అప్పులబాధతో ఆత్మహత్య చేసుకోగా ఆయన కుటుంబాన్ని సోమవారం రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో పరామర్శించారు. సమితి తరపున వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల బాధతో రైతులు ఆత్మహత్య చేసుకోకూడదని చెప్పారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం ఇస్తున్న సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని అన్నారు. రైతు సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు ఇంద్రసేన, నాయకులు నర్సింహా, లింగనాయక్, ఎం.ప్రభు ఉన్నారు.



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న జస్టిస్ చంద్రకుమార్, తదితరులు

పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం

కొడంగల్, ఫిబ్రవరి 5 : మునిసిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మునిసిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు కల్పించాలని ఉపాధ్యాయులు వారి దృష్టికి తీసుకెళ్లారు. నూతన భవన నిర్మాణ నిర్మాణం, స్థానిక సౌకర్యాల కల్పన కోసం నివేదికలు తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలను సందర్శించి పురాతన తరగతి గదులను తొలగించి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పక్కనే ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. రెండు పాఠశాలలను సమీకృతంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్‌లు, నాయకులు ఉన్నారు.



పాఠశాలను సందర్శిస్తున్న వెంకట్‌రెడ్డి, తదితరులు

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 126 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సోమవారం కొడంగల్ క్యాంపు కార్యాలయంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా రెవెన్యూ అధికారులు, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ కే.శివకుమార్‌గుప్త, వైస్‌చైర్‌పర్సన్ ఉషారాణి అందించారు. రూ.1 కోటి 25 లక్షల 89వేల 616 విలువ గల చెక్కులను అందించినట్లు వారు చెప్పారు.కాంగ్రెస్ నాయకులు ఎన్.ప్రశాంత్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

పందుల కోసం వేసిన విద్యుత్ కంచె తగిలి రైతు మృతి

- త్రుటిలో బయటపడ్డ మృతుడి కుమారుడు
- అక్రమ విద్యుత్ కనెక్షన్‌తోనే రైతు చనిపోయాడన్న గ్రామస్థులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పక్క పొలంలో అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ కాలికి తగిలి ఓ రైతు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఉద్దండాపూర్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గువ్వల రాములు(57) సోమవారం తన కుమారుడు నరేష్‌తో కలిసి పొలానికి వెళ్లాడు. ఇద్దరూ తమ పొలంలో అవిసె పంటను పరిశీలిస్తున్నారు. పక్కనే ఉన్న రాములు వదిన శంకరమ్మ పొలాన్ని మైసమ్మతండాకు చెందిన రాందాస్ అలియాజ్ పూజారి శెట్టి.. కౌలుకు తీసుకుని జొన్న సాగు చేశాడు. అడవి పందుల నుంచి తన పంటను కాపాడేందుకని రాందాస్ పొలం చుట్టూ విద్యుత్ వైరు పెట్టాడు. ఈ విషయం తెలియని రాములు తన పొలంలో పంట పరిశీలిస్తున్న క్రమంలో పక్కపొలంలో వేసిన విద్యుత్ తీగ కాలిగి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదం నుంచి మృతుడి కుమారుడు నరేష్ త్రుటిలో బయటపడ్డాడు. తండ్రి మృతి విషయాన్ని నరేష్ తన కుటుంబసభ్యులు, గ్రామస్థులకు ఫోన్‌చేసి చెప్పాడు. రాములు మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా రాందాస్ అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడని, ప్రమాదకరంగా కరెంటు కంచె వేయడం వల్లే తోటి రైతు మృత్యువాత పడ్డాడని, అతడిపై చర్యలు తీసుకొని మృతిచెందిన రైతు కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు. నరేష్ ఫిర్యాదు మేరకు విద్యుత్ తీగ తగిలి రాములు మృతిచెందిన స్థలాన్ని రూరల్ సీఐ అశోక్, కరన్‌కోట్ ఎస్సై మధుసూదనరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలను సేకరించారు. రాందాస్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



రాములు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిద్దాం

- ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీ రంగరాజన్

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు విద్యను దూరం చేసే నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ రంగరాజన్ పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా సోమవారం మేడ్చెల్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యను ప్రైవేటీకరణ చేసేందుకే నూతన విధానం తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేదలకు చదువును దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. దేశంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, విదేశీ విశ్వవిద్యాలయాలు పెరిగిపోవడం వల్ల పేదలు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కడ్తాల్ , ఫిబ్రవరి 5 : పర్యావరణ పరిరక్షణను అందరు సామాజిక బాధ్యతగా భావించాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) సంస్థ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. మొక్కల పెంపకంపైనే భావితరాల మనుగడ ఆధారపడి ఉంటుందని ఆమె చెప్పారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలో ది ఎర్త్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మల్లేపల్లి జగన్ సోమవారం లీలా లక్ష్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు జగన్ పూలమొక్కను అందజేశారు. సీజీఆర్ నిర్వాహకుడు లక్ష్మారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



లీలాలక్ష్మారెడ్డికి మొక్కను అందజేస్తున్న జగన్

డిజిటల్ యుగానికి ధీటుగా విద్యార్థులను తీర్చి దిద్దాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5 : డిజిటల్ యుగంలో పోటీతత్వాన్ని ఎదుర్కునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకుల పై ఉందని బీహెచ్ఈఎల్ సంస్థ ఆర్అండ్‌డీ డైరెక్టర్ మోహన్ రావు అన్నారు. మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ఉమెన్స్ యూజీసీ అటానమస్‌లో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోహన్‌రావు మట్లాడుతూ.. వేగవంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులపై అధ్యాపకులు ముందుగా దృష్టి సారించి వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కంప్యూటర్ సైన్స్‌ను బోధించే అధ్యాపకులు తమ బోధనా విధానాన్ని మరింత మెరుగు పరుచుకోవాలని డాక్టర్ చక్రవర్తి భగవతి అన్నారు. సబ్జెక్టు విషయంలో అధ్యాపకులు ముందుగా అప్‌డేట్ కావాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవిలత, డాక్టర్ రుక్మ రేఖ, పాల్గొన్నారు.

టీజీ అక్షరాల ఏర్పాటు అభినందనీయం

- మాజీ హోంమంత్రి టి. దేవెందర్‌గౌడ్



మహేశ్వరం, ఫిబ్రవరి 5 : వాహనాల నెంబర్ ప్లేట్లపై టీజీ అనే అక్షరాలు ఉండాలని ఉద్యమ సమయంలో తాను చేసిన ప్రతిపాదనను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను అమలు చేస్తున్నందుకు ఆనందంగా ఉందని ఉమ్మడి రాష్ట్ర మాజీ హోంమంత్రి టి. దేవెందర్‌గౌడ్ అన్నారు. సోమవారం తుక్కుగూడలోని ఆయన నివాసంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వాహనాల నెంబర్ ప్లేట్ల విషయమేకాకుండా ప్రజలకు సంబంధించిన అనేక అంశాలలో కేసీఆర్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు పోయి ప్రజల మనస్సులను గాయపర్చిందన్నారు. కేంద్రం టీజీ అని గెజిట్ ఇస్తే కేసీఆర్ టీఎస్ అని మార్చారని ఆరోపించారు. ఈ ప్రతిపాదనను తాను 2008లోనే చెప్పానని గుర్తుచేశారు. నాడు ఏపీ అక్షరాలను వాహనాలపై తొలగించి టీజీ అక్షరాలు రాయాలని నవ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టామన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు నోటిఫికేషన్

- కసరత్తు ప్రారంభించిన అధికారులు
- సి - నోటిఫికేషన్ జారీ

తాండూరు, ఫిబ్రవరి 5 : పట్టణంలో రోడ్ల విస్తరణకు ప్రణాళిక సిద్ధమైంది. ఇందిరాచౌక్ నుంచి తాండూర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు విస్తరణకు అడుగు ముందుకు పడింది. ఈ మేరకు మునిసిపల్, రెవెన్యూశాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, ఒకే సమావేశంతో పెండింగ్‌లో పడింది. ఇప్పుడు ఈరోడ్డును 80 ఫీట్ల వెడల్పుతో, డివైడర్‌కు ఇరువైపుల 40 ఫీట్ల చొప్పున విస్తరించనున్నారు. ఇటీవల రోడ్డుకిరువైపులా ఉన్న ఇళ్ళు, ఖాళీస్థలాలు, దేవాదాయ ఆస్తులను మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల బృందం సర్వే చేసి నివేదికను రెవెన్యూ డివిజనల్ అధికారికి సమర్పించారు. ఇరువైపులా సర్వే నెం. 133, 134, 135ల్లో ఉన్న 94 భవనాలను గుర్తించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియలో భాగంగా పునరావసం, నష్టపరిహారం పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 ద్వారా సే - నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్లు పోతున్న వ్యక్తులు 60 రోజులలో జిల్లా కలెక్టర్, తాండూరు ఆర్డీఓ వద్ద అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆ భూముల అమ్మకం, కొనుగోలు చేయొద్దని, ఎటువంటి రుణాలు తీసుకోవద్దని పేర్కొన్నారు.



ఆర్డీఓ శ్రీనివాసరావు

నోటిఫికేషన్ విడుదల చేశాం - ఆర్డీఓ

ఇందిరాచౌక్ నుంచి రైల్వేస్టేషన్ వరకు గల రోడ్డు విస్తరణకు ఫామ్ - సి నోటిఫికేషన్ విడుదల చేశాం. కావున ఈ మార్గంలో విస్తరణ ప్రక్రియ ముగిసే వరకు ఆస్తిమార్పిడి, అమ్మకాలు చేయకుడదు. ఈ రోడ్డులో ఉన్న భవనాలు, ఖాళీస్థలాల యజమానుల అభిప్రాయాలు పరిగణంలోకి తీసుకుటాం.

ఇంటిపన్ను రశీదు ఇవ్వడం లేదని కమిషనర్‌కు ఫిర్యాదు

- విచారణ జరపాలని డిమాండ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 5 : ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఇంటిపన్నులకు రశీదులు ఇవ్వకుండ పలువురు మునిసిపల్ సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారని దాసరి బాల్‌నర్సింహ అనే వ్యక్తి సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో 200 చదరపు గజాల స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే దానికి రూ.48,500 ఇంటి పన్ను విధించగా.. గత సంవత్సరం జూలై 19న మునిసిపల్ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ అనితకు ఆ మొత్తాన్ని చెల్లించినప్పటికీ నేటికీ ఇంటిపను రశీదు ఇవ్వడంలేదని చెప్పాడు. పలుమార్లు రశీదు గురించి అడిగితే సమాధానం చెప్పకుండా దాటవేస్తోందని వాపోయాడు. ఆమెను గట్టిగా నిలదీస్తే తాను ఇచ్చిన డబ్బులు కౌన్సిలర్ అంజనేయులు వద్ద ఉన్నాయని చెబుతున్నట్లు తెలిపాడు. ఆమెపై విచారణ జరిపి చర్యలు తీసుకుని తనకు రశీదు ఇప్పించాలని బాల్‌నర్సింహ డిమాండ్ చేశాడు. కాగా గతంలో మున్సిపాలిటీకి చెందిన ఓ బిల్‌కలెక్టర్ రూ.3కోట్లకు పైగా పన్నులు వసూలు చేసిన సొమ్మును స్వాహా చేసిన విషయం తెలిసిందే ఈవిషయమై విచారణ జరుగుతుండగానే నెలల తరబడి రశీదు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న విషయం వెలుగు చూడటంపై పలువురు విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 5 : పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం సోమవారం గోవింద నామస్మరణతో మారుమోగింది. దేవాలయంలో జరుగుతున్న రథోత్సవ జాతరలో భాగంగా మొదటి రోజు దేవాలయంలో ప్రధాన అర్చకులు పుణ్యావాచన, ధ్వజారోహణము, అఖండదీపారాధనతో పాటు రాత్రి స్వామి వారిని శేష వాహనంపై కన్నుల పండువగా ఊరేగించారు. ఈ సందర్భంగా దేవాలయం వ్యవస్థాపక ధర్మకర్తలు పూజారి శ్రీకాంత్, శ్రీపాదులు మాట్లాడుతూ. ఈనెల 9 వరకు ప్రత్యేకపూజ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 9న అమావాస్య రోజు స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. దేవాలయ ఈవో నరేందర్, భక్తులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

మేడ్చల్ మున్సిపల్‌లో పౌర సేవా కేంద్రం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5 : స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించటంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా పౌర సేవా కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తగిన సమాచారం ఇవ్వటంతో పాటు, ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ఇక్కడ స్వీకరిస్తారు. ఈ సెంటర్ నిర్వాహణకు ప్రత్యేకంగా ఇద్దరు సిబ్బందిని నియమిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అనంతగిరి పల్లిలో బొడ్రాయి ఉత్సవాలు

వికారాబాద్, ఫిబ్రవరి 5 : మునిసిపల్ పరిధిలోని అనంతగిరిపల్లిలో నూతన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. కౌన్సిలర్ మురళి, అనంతయ్య, బాగయ్య, రాజునాయక్, రెడ్డి శేఖర్, నర్సింహులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ కౌన్సిలర్‌పై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5 : గోశాలలోకి ఆక్రమంగా ప్రవేశించి, అసభ్యకరమైన పదజాలంతో దూషించి, బెదిరింపులకు పాల్పడిన 4వ వార్డు కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్‌తో పాటు పలువురిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని మాధవరెడ్డి వంతెన సమీపంలోని గోశాలలోకి ఆంజనేయులుగౌడ్ మరికొంతమందితో ఆక్రమంగా ప్రవేశించి అసభ్యకరంగా దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు గోశాల నిర్వాహకుడు నల్లబోతు వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోశాలను ఎందకు పెట్టావ్, దాన్ని మూసివేయిస్తానని బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకుందాం

● ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 5: పరిగి మున్సిపాలిటీని పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అధ్యతన సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజూరై నిలిచిపోయిన రూ.25కోట్ల నిధులను తాను తిరిగి తీసుకొస్తానని చెప్పారు. కొత్త మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేస్తానని తెలిపారు. పరిగి మున్సిపాలిటీని అభివృద్ధిలో నిలిపేందుకు కృషిచేస్తానని చెప్పారు. పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే నిధులను మంజూరు ఇస్తానని తెలిపారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి చేపడతామన్నారు. కొత్తగా కాలనీల్లో మిషన్‌భగీరథ పైపలైన్, నల్లా కనెక్షన్లు లేనట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయమై భగీరథ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడానని చెప్పారు. త్వరలో నల్లాలు ఇప్పిస్తానని తెలిపారు. నీటితోపాటు, వీధిదీపాలు, సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న రూ.6కోట్ల ఎల్ఆర్ఎస్ నిధులను తెప్పిస్తానని చెప్పారు. నేవీ రాడార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

స్టేషన్‌తో పరిగి చరిత్రలో నిలువనుందని తెలిపారు. 2900ఎకరాల్లో రూ.2500కోట్లతో త్వరలోనే పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. స్కూల్, ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందని, స్థానికులకు 15శాతం రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల ద్వారా కేపీ లక్ష్మీదేవిపల్లి దగ్గర 20టీఎంసీల రిజర్వాయర్ నిర్మించి పరిగికి సాగునీరు తెస్తానని తెలిపారు. పరిగికి రైల్వేలైను నిర్మాణానికి రూ.3100కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పాత ఇళ్ల రికార్డుల్లో లేవని, వాటిని రికార్డుల్లో చేర్చడానికి నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై చొరవ తీసుకుని పరిష్కరించాలని ఆరవవార్డు కౌన్సిలర్ నాగేశ్వర్‌రావు ఎమ్మెల్యేను కోరారు. మిషన్‌భగీరథ, హరిత హారం నిధులు కాజేశారని, అయితే ఒక్కమొక్క కూడా లేదని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ జె.శ్రీనివాస్ ఆరోపించారు. విద్యుత్ లైట్లు, స్తంభాల ఏర్పాటుపై ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. ఏడవార్డు కౌన్సిలర్ టి.వెంకటేశ్ మాట్లాడుతూ వెంచర్లలో మున్సిపాలిటీకి వదిలేసిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని కోరారు. అన్ని కాలనీల్లో పైపులైన్లు వేసి నల్లాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ జి.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

పూడూరు: మండలంలోని రాకంచర్లకు చెందిన పెంటయ్య ఆధ్వర్యంలో చన్‌గోముల్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిధులను తెప్పించాలని ఎమ్మెల్యేకు వినతి

పరిగి: పరిగి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటి సారిగా పరిగి మున్సిపల్ సమావేశానికి హాజరైన డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డిని మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చైరమ్మన్, కమిషనర్‌లతోపాటు, కౌన్సిలర్లు అందరూ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ గత ప్రభుత్వంలో మంజూరై నిలిచిపోయిన రూ.25 కోట్ల నిధులను తెప్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.6 కోట్లు నిధులు ఉండగా..వాటిని వాడుకోకుండా హోల్డ్‌లో పెట్టారని, ఈ నిధులను ఖర్చు చేసేవిధంగా హోల్డ్ నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్.ఎమ్మెల్యేను కోరారు. రూ.25 కోట్లు తెప్పిస్తానని, అలాగే ఎల్ఆర్ఎస్ కింద జమ అయిన రూ.6 కోట్లు కూడా హోల్డ్‌లో నుంచి తీసివేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నాబార్డు నిధులతో గోదాం, రైస్‌మిల్లు నిర్మాణం

కులకచర్ల, ఫిబ్రవరి 5: రైతుల అభ్యున్నతికి నాబార్డు నిధులతో గోదాం, రైస్‌మిల్లును నిర్మించామని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని తిరుమలపూర్ గ్రామ పరిధిలో నాబార్డు నిధులు రూ.కోటీ 60లక్షలతో నిర్మించిన గోదాంను ఇప్పటికే ప్రారంభించగా సోమవారం రైస్‌మిల్లును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ ప్రాంత రైతుల అభ్యున్నతికి తాను డీసీసీబీ చైర్మన్‌గా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. తాను ఎక్కడున్నా ఈప్రాంత ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.


తిరుమలపూర్‌లో రైస్‌మిల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తిరుమలపూర్ గ్రామ సొసైటీ డైరెక్టర్‌గా మొగులయ్య

కులకచర్ల: మండలంలోని తిరుమలపూర్ గ్రామ సొసైటి డైరెక్టర్‌గా అదే గ్రామానికి చెందిన కనకం మొగులయ్య సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో 10 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుమలపూర్ సొసైటీ డైరెక్టర్‌గా గతంలో ఏకగ్రీవంగా ఎన్నికైన మనోహర్‌రెడ్డి డీసీసీబీ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాండూర్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో డీసీసీబీ, డైరెక్టర్ పదవులు ఖాళీ అయ్యాయి. సొసైటీకి చెందిన 10మంది సభ్యులు ఏకగ్రీవంగా అదేగ్రామానికి చెందిన కనకం మొగులయ్యను డైరెక్టర్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నాగరాజు, విజయ్‌కుమార్ పాల్గొనకపోవడం గమనార్హం. త్వరలోనే సొసైటీ చైర్మన్ ఎన్నిక జరగనుంది.

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం

కీసర, ఫిబ్రవరి5: నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్‌లపై కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెడుతూ డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు నాగారం మున్సిపల్ కార్యాలయంలో మొత్తం 20మంది సభ్యులు ఉండగా అందులో 14మంది కౌన్సిలర్లు చైర్మన్ చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్‌లపై అవిశ్వాసం పెడుతూ సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లోని డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. అవిశ్వాసంపై సమగ్ర విచారణ జరిపి వివరాలు తెలియజేస్తామని అధికారులు తెలిపినట్లు నాగారం మున్సిపల్ కౌన్సిలర్లు తెలిపారు.


తీర్మానాన్ని డీఆర్‌వోకు అందజేస్తున్న కౌన్సిలర్లు

క్రైం కార్నర్

బావిలో పడి వ్యక్తి మృతి

దోమ, ఫిబ్రవరి 5: మద్యం మత్తులో బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన దోమ మండలంలోని కొండాయిపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఉడుము వెంకటయ్య(27) పొలం దగ్గర మద్యం మత్తులో బురదలో పడిపోయాడు. దీంతో కడుక్కునేందుకు సమీపంలోని బావి వద్దకు వెళ్లి మునిగిపోయాడు. గమనించిన చుట్టు పక్కల పొలాల రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. వెంకటయ్యను బావిలో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.


వెంకటయ్య మృతదేహం

ఇళ్లలోకి దూసుకెళ్లిన టిప్పర్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5: అదుపు తప్పి ఓ టిప్పర్ లారీ రెండు ఇళ్లలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండలంలోని రావల్‌కోల్ ఖాసీంబాయి తండాలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రావల్‌కోల్ గ్రామ శివార్లలో ఉన్న క్రషర్ నుంచి సోమవారం లారీ టిప్పర్ రోబోస్యాండ్ తరలిస్తు ఖాసీంబాయి తండా వద్దకు రాగా అక్కడ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. అనంతరం సమీపంలోని వడ్డర లక్ష్మణ్, శంకర్ల ఇంట్లోకి దూసుకుపోయింది. లారీ తమ ఇంట్లో దూసుకొస్తున్న విషయం గమనించిన లక్ష్మణ్ కుటుంబ సభ్యులు ఇంటినుంచి బయటికి పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ఘటనలో లక్ష్మణ్ ఇంటి రెండు గదులు ధ్వంసం కాగా, శంకర్‌కు చెందిన ఇల్లు పాక్షికంగా ధ్వంసమయ్యింది. ఈ మేరకు బాధితులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించి సదరు టిప్పర్ డ్రైవర్‌పై ఫిర్యాదు చేశారు.


ఇళ్లలోకి దూసుసుకెళ్లిన టిప్పర్

కౌన్సిలర్ భర్తపై దాడి.. కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5: పాతకక్షల నేపథ్యంతో కౌన్సిలర్ భర్తపై ఓయువకుడు దాడి చేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ భర్త బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఘట్‌కేసర్‌లోని శివారెడ్డి మారుతినగర్‌లో జరిగే తన బంధువుల అంత్యక్రియలకువెళ్ళాడు. శవయాత్ర జరుగుతుండగానే చందుపట్లగూడకు చెందిన మహిపాల్‌రెడ్డి పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని బొక్క ప్రభాకర్‌రెడ్డిని వెనుక నుంచి తన్ని దాడిచేశాడు. దీంతో ఇరువురికి గొడవ జరుగుతుండటంతో పక్కనే ఉన్నవారు అక్కడి నుంచి సముదాయించి పంపించారు. బాధితుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాండూరురూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని ఖాంజాపూర్ కాగ్నా నదిలో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఖాంజాపూర్ కాగ్నా వాగులో సోమవారం ఉదయం 9గంటల సమయంలో ట్రాక్టర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక లోడ్ చేసి బషీర్‌మియా తండాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ శ్రీకాంత్‌ను విచారించగా అనుమతి పత్రాలు చూపించలేదు. దీంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు సీఐ తెలిపారు.


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

తాండూరురూరల్: మండలంలోని ఖాంజాపూర్ కాగ్నా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని డ్రైవర్ వర్త్య సోమ్యానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంకుషాపూర్‌లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని అంకుషాపూర్ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 270/ పార్టులో అక్రమనిర్మాణాలు వెలుస్తున్నాయని అదే గ్రామానికి చెందిన పిట్టల రాజు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై చర్యలు తీసుకోవాలి


కొడంగల్‌లో ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, ఫిబ్రవరి 5: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్ఐ భరత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.కృష్ణంరాజు, కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి సోమ శేఖర్, జీ.రాము, కృష్ణంరాజు, రమేశ్, ఎస్.దస్తప్ప, లక్ష్మణ్ తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

పూడూరు, ఫిబ్రవరి 5: మండలంలో వారం రోజులుగా ప్రతీ గ్రామంలో తిరుగుతూ ఉపాధి హామీ సామాజిక తనిఖీ చేసిన బృందం అట్టి వివరాలను సోమవారం ప్రజాక్షేత్రంలో వివరించారు. అడిషనల్ పీడీ స్టీఫెన్‌నిల్, డీవోపీ రాములు, ఎంపీడీవో ఉమాదేవి సమక్షంలో తనిఖీ బృందం వివరాలు వెల్లడించింది. ఈ తనిఖీలో ఆయా గ్రామాల్లో కూలీల సంతకాలు లేకుండానే పేమెంట్ చేసినట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాములు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం

నేడు కిసాన్ మేళా

పూడూరు, ఫిబ్రవరి 5: కేంద్రియ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, సంస్థ ప్రధాన శాస్త్రవేత్త నిర్మల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో వ్యవసాయ, వాటి అనుబంధ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు.

పంచాయతీ పాలకవర్గం సేవలు మరువలేనివి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5: గ్రామపంచాయతీ పాలకవర్గం సేవలు మరువలేనివని అవుషాపూర్ కార్యదర్శి సునీత తెలిపారు. మండలంలోని అవుషాపూర్ పంచాయతీ ఆవరణలో పాలకవర్గాన్ని సోమవారం ఆమె శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామానికి పాలకవర్గం అనేక సేవలు అందించారని గుర్తుచేశారు. పాలకవర్గం చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అయిలయ్య యాదవ్, మాజీ వార్డుసభ్యులు మల్లేష్, రాధా, వీరేష్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్, శిరీషవామన్ రెడ్డి, కుశలవరెడ్డి, పద్మ, సంధ్య, దివ్య కో-ఆప్షన్ సభ్యులు జయశ్రీ పాల్గొన్నారు.


సన్మానం అనంతరం పాలకవర్గంతో కార్యదర్శి సునీత

వెంచర్‌లో చెట్ల నరికివేత

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కేఎల్ఆర్ వెంచర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం పచ్చని చెట్లను నరికివేశారు. గమనించిన స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకునే లోపు చెట్లను తొలగిస్తున్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బంది చెట్ల నరికివేతకు పాల్పడ్డ వారిపై విచారణ జరిపి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


కేఎల్ఆర్ వెంచర్‌లో నరికివేసిన చెట్లు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని కొర్రెముల జిల్లా పరిషత్ పాఠశాలలో 2003-2004 బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం స్థానిక శోభా గెస్ట్‌హౌజ్‌లో ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. 2003-2004 బ్యాచ్ విద్యార్థులకు చదువు చెప్పిన గురువులకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాపిరెడ్డి, వివేనందం, ప్రహ్లాద్, శివన్న, నారాయణ, వెంకటరమణ, 2003-2004 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

వికారాబాద్, ఫిబ్రవరి 5: జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీన జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని మండల విద్యాధికారులు, యాజమాన్య పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థులను పోటీలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వివరాలకు 9701103057, 9440002515 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పేదరిక నిర్మూలనే బీజేపీ లక్ష్యం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5: దేశంలో పేదరికం నిర్మూలనే బీజేపీ ప్రభుత్వం లక్ష్యమని గుండ్లపోచంపల్లి కండ్లకోయ కౌన్సిలర్ హంస రాణి కృష్ణగౌడ్ అన్నారు. గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా హంసరాణి సోమవారం తమ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి కండ్లకోయలో ఇంటింటికి తిరిగి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

దౌల్తాబాద్, ఫిబ్రవరి 5: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అందజేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో సోమవారం చికిత్స పొందుతున్న దౌల్తాబాద్ మండలం అంతారం గ్రామానికి చెందిన రేవతి కుటుంబ సభ్యులకు రూ.2,75,000, కోస్గి పట్టణానికి చెందిన లింగప్ప కుటుంబ సభ్యులకు రూ.3లక్షల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లను ఫోన్ నెంబర్‌కు లింక్ చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 5: విద్యుత్ వినియోగదారులు గృహాలకు, వాణిజ్య సముదాయాలకు తమ ఎలక్ట్రికల్ మీటర్‌కు ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవాలని పట్టణ ఎలక్ట్రికల్ ఏఈ పూర్ణ చందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ ఫోన్‌నెంబర్‌ను తమ వద్దకు వచ్చిన బిల్‌రీడర్ లేని పక్షంలో టీఎస్ఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ నెంబర్ లింక్ ద్వారా అప్డేట్ చేసుకోవాలని సూచించారు. వినియోగదారులు ఫోన్‌నెంబర్‌ను లింక్ చేయడం ద్వారా ఎలక్ట్రికల్ బిల్లు ఎప్పటికప్పుడు మెసేజ్ వస్తుందన్నారు. ఎప్పుడైనా షెడ్యూల్ పవర్ కట్ ఉన్నా ముందస్తు సమాచారం అందుతుందన్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యను పరిష్కరించాలి

పూడూరు, ఫిబ్రవరి 5: తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆటో యూనియన్ నాయకులు, గ్రామస్తులు పలువురు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. చన్‌గోముల్‌లో సోమవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిశారు. ఈ సందర్భంగా మన్నెగూడ-చన్‌గోముల్ వరకు రోడ్డు వేయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈరోడ్డు మార్గం పూర్తిగా పాడవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి వారి కుటుంబానికి తీరని నష్టం వాటిల్లుతుందని వాపోయారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆటో యూనియన్ సభ్యులు మల్లేశం, యాదయ్య, సాయిప్రసాద్, శ్రీనాథ్, జాఫర్ పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 5: వికారాబాద్‌లోని రాజీవ్‌నగర్ దగ్గర కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కొత్తగా క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మురళిలు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఈ క్రిటికల్ కేర్ పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అత్యవసర సమయాల్లో హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్ నాయక్, ముత్తహార్‌షరీఫ్, వేణుగోపాల్, కృష్ణ, ఆసిఫ్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, అధికారులు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 5: మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు పోచారం మునిసిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి గణేష్‌నగర్‌లో 12.20లక్షల మున్సిపాలిటీ సాధారణ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, ఏఈ నరేష్, నాయకులు నర్సింహ, బాల్‌రాజు, లక్ష్మణ్, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్

గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ కృషి మరువలేనిది

యాలాల, ఫిబ్రవరి 5: పాఠశాలల అభివృద్ధితో పాటు తండా అభివృద్ధికి మాజీ సర్పంచ్ మిత్రునాయక్ కృషి మరవలేనిదని బషీర్‌మియా, బామ్లానాయక్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, లక్ష్మీనారాయణ అన్నారు. బషీర్‌మియా సర్పంచ్ మిత్రునాయక్ పదవీకాలం ముగియడంతో సోమవారం ఆయనను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రాజు, శ్రీనివాస్, మురళి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కృష్ణకుమార్, పంచాయితీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బషీర్‌మియా తండా మాజీ సర్పంచ్ మిత్రునాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె

తాండూరు ఫిబ్రవరి 5: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 16న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని తాండూరు మున్సిపల్ కార్మికులు సోమవారం మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్మికులకు కనీసవేతనం రూ.26వేలు, విధినిర్వాహణలో కార్మికులు చనిపోతే 25లక్షల ఇన్సూరెన్స్, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కౌన్సిల్ ఆమోదం తెలిపిన ఇద్దరు కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్‌తో పాటు దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటామని వినతిపత్రం అందజేశారు.

29లోపు ఈకేవైసీని పూర్తి చేయాలి

కులకచర్ల, ఫిబ్రవరి 5: డీలర్లు ఈనెల 29లోపు ఈకేవైసీ పూర్తి చేయాలని తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందించే నిత్యావసర సరుకులను పొందేందుకు ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దౌల్తాబాద్, ఫిబ్రవరి 5: దౌల్తాబాద్ పంచాయతీలో యంపీవోగా విధులు నిర్వహిస్తున్న బోడి మల్కమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ శిరీష రమేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మల్కమ్మ మృతి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, సాయిలు, చెన్నప్ప, లక్ష్మప్ప, భీమ్‌రెడ్డి, విజయలక్ష్మీ, అంజి, లలిత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ తరపు నుంచి రూ.10వేలు, పంచాయతీ కార్యదర్శి గోపాల్‌నాయక్ రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్మాని సాయిలు, రాములు, మల్కప్ప, శంకరప్ప, పకీరప్ప, దస్తప్ప, సాయప్ప, సాయమ్మ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్